# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-10-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **అమెరికాలోని లాస్‌వెగాస్ నగరంలో నిర్వహించిన ఐటీ సర్వ్ సినర్జీ సదస్సులో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు.**
2. **దేవాలయాల్లో ప్రసాదాల తయారీ విధానాలపై ఉన్నత స్థాయి నిపుణుల కమిటిని నియమించినట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడించారు.**
3. **రాష్ట్రంలో శాంతి భద్రతలకు ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.**
4. **రాష్ట్రంలో 4 కోట్ల 14 లక్షల 20 వేల 935 మంది ఓటర్లు ఉన్నారని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ తెలిపారు.**
5. **ఉపాధ్యాయ అర్హత పరీక్ష-టెట్ తుది 'కీ'ని పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది.**

==========================

అమెరికాలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పర్యటన కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఆయన లాస్‌వెగాస్ నగరంలో నిర్వహించిన ఐటీ సర్వ్ సినర్జీ సదస్సులో పాల్గొని రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలతలను గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

వాయిస్ (30 సెకన్లు)

--------------------------

రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య 4 కోట్ల 14 లక్షల 20 వేల 935కు చేరిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ తెలిపారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ-2025కు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం ముసాయిదా జాబితాను విడుదల చేసింది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న ముసాయిదా జాబితా వివరాలను వివేక్ యాదవ్ వెల్లడించారు. సార్వత్రిక ఎన్నికల నాటి నుండి రాష్ట్రంలో 19 వేల 48 మంది ఓటర్లు పెరిగారని తెలిపారు. వచ్చే నెల 9, 10, 23, 24 తేదీల్లో అభ్యంతరాల స్వీకరణ కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నామని తెలిపారు. 2025 నాటికి 18 ఏళ్లు నిండబోయే వారు కూడా ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని వివేక్ యాదవ్ సూచించారు.

--------------------------

దేవాలయాల్లో ప్రసాదాల తయారీ, ఇతరత్రా అవసరాల కోసం వినియోగించే నెయ్యి సేకరణకు అనుసరించాల్సిన విధానాలపై ఉన్నత స్థాయి నిపుణుల కమిటీని నియమించినట్లు ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. దేవాలయాలకు నెయ్యి సరఫరాపై వివిధ డెయిరీ సంఘాలు, సంస్థల ప్రతినిధులతో విజయవాడలో నిన్న మంత్రి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

..వాయిస్..25 సెకన్లు

---------------------------

ఉపాధ్యాయ అర్హత పరీక్ష–టెట్ తుది 'కీ'ని విడుదల చేసినట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు తెలిపారు. అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి వివరాలు పొందవచ్చని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 3 నుంచి 21 వరకు రోజుకు రెండు విడతలుగా టెట్ నిర్వహించింది. ఇటీవల ప్రాథమిక 'కీ' విడుదల చేసి, అభ్యంతరాలు స్వీకరించింది. అన్నింటిని పరిశీలించిన తర్వాత తుది 'కీ' విడుదల చేసింది.

---------------------------

రాష్ట్రంలో శాంతి భద్రతలకు ప్రాధ్యానత ఇస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలిలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ (25 సెకన్లు )

---------------------------

ప్రధానమంత్రి ఉపాధికల్పన కార్యక్రమం– పీఎంఈజిపిలో అర్హులైన యువత నమోదు చేసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. పార్వతీపురం కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిరుద్యోగులు సొంత వ్యాపారాలను చేసుకునేందుకు ఈ పథకం దోహదపడుతుందని అన్నారు. ఈ పథకం కింద రుణం తీసుకునే వారికి 30 శాతానికి పైగా కేంద్ర ప్రభుత్వం రాయితీ ఇస్తుందని కలెక్టర్ తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల పరిధిలో ఖరీఫ్ పంటకాలంలో 54 కరవు మండలాలను ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తీవ్ర కరవు మండలాలు 27 కాగా, మధ్యస్థంగా మరో 27 ఉన్నాయి. జూన్ 4 నుంచి సెప్టెంబరు 30 వరకు మండలాల వారీగా వర్షపాతం, పొడి వాతావరణంతోపాటు సాగు విస్తీర్ణం, రిమోట్ సెన్సింగ్ ఆధారిత సమాచారం, తేమ, జలవనరుల లభ్యత వంటి అంశాల ఆధారంగా కరవు మండలాలను నిర్ణయించినట్లు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా తెలిపారు. ఈ మండలాల పరిధిలో కరవు సహాయక చర్యలు చేపట్టడంతోపాటు రైతులకు రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

---------------------------

సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా తిరుపతిలో రక్తదాన శిబిరాన్ని ఎస్పీ ఈరోజు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. తద్వారా ప్రాణాపాయంలో ఉన్నవారిని కాపాడవచ్చని తెలిపారు.

---------------------------

భారతీయ విజ్ఞాన మండలి, సైన్స్ సిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కౌశల్-2024 రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రతిభాన్వేషణ పోటీల గోడపత్రికను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు నిన్న ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 8, 9, 10 తరగతుల విద్యార్థులకు క్విజ్, పోస్టర్, రీల్స్ విభాగాల్లో పాఠశాల, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. నవంబరు 20, 21, 22 పాఠశాల స్థాయి పరీక్ష, డిసెంబరు 6న జిల్లా స్థాయి, డిసెంబరు 30న రాష్ట్ర స్థాయి పరీక్షను నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు వచ్చే నెల 15లోపు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.

---------------------------

భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా వచ్చే నెల 15 వ తేదిన జన జాతీయ గౌరవ్ దివస్‌గా నిర్వహించనున్నామని పార్వతీపురం గిరిజన సమీకృత అభివృద్ధి సంస్థ – ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. పార్వతీపురంలోని ఐటిడిఎ కార్యాలయంలో సంబంధిత అధికారులతో ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధాన మంత్రి జన్ మన్ కార్యక్రమం ద్వారా గిరిజనుల మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం క్రింద అవగాహన కార్యక్రమాలను నిర్వహించి గ్రామస్తుల అవసరాలు గుర్తించాలని అధికారులకు సూచించారు.

---------------------------

తిరుమల తిరుపతి దేవస్థానం-టిటిడి రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నవంబర్, డిసెంబర్ నెలల్లో ఇంగ్లండ్, ఐర్లాండ్ సహా ఐరోపాలోని 8 దేశాల్లోని మొత్తం 13 నగరాల్లో తిరుమల వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన గోడ పత్రికని రాష్ట్ర ఎన్నారై సాధికారత శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆవిష్కరించారు. వచ్చే నెల 9 నుంచి డిసెంబర్ 21 వరకు ఆయా నగరాల్లో కల్యాణోత్సవాలు జరుగుతాయని తెలిపారు.

---------------------------

గ్రంథాలయ శాస్త్రంలో సర్టిఫికెట్ కోర్సు ప్రవేశాలకు వచ్చే నెల 1వ తేదీ నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పౌర గ్రంథాలయ శాఖ సంచాలకులు ప్రసన్నకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 15 వరకు దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని, పూర్తి చేసిన వాటిని 18న సాయంత్రం 5గంటలలోపు సమర్పించాలని సూచించారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులు లేదా దానికి సమానమైన ఏదైనా యూజీసీ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయంలో ఉత్తీర్ణులైన వారు అర్హులని చెప్పారు. పీఎన్ స్కూల్ ఆఫ్ లైబ్రరీ సైన్సు-విజయవాడ, రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లైబ్రరీ సైన్సు కడప, వావిలాల సంస్థ లైబ్రరీ సైన్సు గుంటూరులలో తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో 40 సీట్ల చొప్పున ఉన్నాయని తెలిపారు.

---------------------------

ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగంలో క్యాజువల్ న్యూస్ రీడర్ కమ్ ట్రాన్స్‌లేటర్, క్యాజువల్ న్యూస్ ఎడిటర్‌గా పనిచేసేందుకు అభ్యర్థులనుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రాంతీయ వార్తా విభాగాధిపతి శ్రీసాయి వెంపాటి ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ పరిసర ప్రాంతాల్లో నివసించే అర్హులైన అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఆఫ్‌లైన్ విధానంలో వచ్చే నెల 5వ తేదీలోపు ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగానికి పంపించవచ్చని తెలిపారు.

అదే విధంగా అమరావతి రాజధాని ప్రాంతం, శ్రీసత్యసాయి జిల్లాలో పార్ట్ టైమ్ న్యూస్ కరస్పాండెట్లుగా పనిచేసేందుకు స్థానిక అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రాంతీయ వార్తా విభాగాధిపతి తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆఫ్‌లైన్ విధానంలో వచ్చే నెల 8వ తేదీలోపు దరఖాస్తులను విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగానికి పంపవచ్చని చెప్పారు. మరిన్ని వివరాలకు 9440674057 నెంబరును సంప్రదించవచ్చని వెల్లడించారు.

======================